మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

17.11.2025 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 208 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## తొలి టెస్టులో భారత్‌కు అనూహ్య ఓటమి



07

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

ఢిల్లీ పేలుళ్ల కేసులో
# వైట్‌కాలర్ ఉగ్రవాదం
## ఆచూకీ లేకుండా పోయిన 15 మంది డాక్టర్లు

మరో 200 మందిపైనా దర్యాప్తు సంస్థల నిఘా
ప్రియాంక శర్మ అనే వైద్యురాలి అరెస్టు, విడుదల
ఆమె సెల్‌ఫోను, ఓ సిమ్ కార్డు సీజ్
ఉమర్ నబీ సహచరుడు రషీద్ అలీ అరెస్టు
పేలిన ఐ20 కారు రిజిస్ట్రేషన్ రషీద్ పేరిటే



ఢిల్లీ పేలుళ్ల కేసులో దర్యాప్తు సంస్థలు లోతుగా విచారణ చేస్తున్నాయి. ఇందులో భాగంగా వైట్ కాలర్ ఉగ్రవాదంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. అయితే, ఢిల్లీ పేలుడుతోపాటు వైట్‌కాలర్ ఉగ్రవాదంతో సంబంధం ఉన్న 15 మందికి పైగా డాక్టర్లు ప్రస్తుతం ఆచూకీ లేకుండా పో యారని పోలీసు వర్గాలు తెలిపాయి.

## ఢిల్లీలో కారు పేలుడుకు 'మదర్ ఆఫ్ సైతాన్'?



## బిహార్ సీఎంగా నితీశే!

19 లేదా 20న ప్రమాణ స్వీకారం
మంత్రివర్గ ఫార్ములా కూడా ఖరారు!
బీజేపీకి 15-16బీ జేడీయూకు 14 పదవులు

.. వివరాలు 4లో



## పెళ్లి కోసం పసికందు బలి

కాళ్లతో తొక్కి చంపిన నలుగురు యువతులు
రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘటన

.. వివరాలు 4లో

## ప్రేమ పాశమే.. యమపాశమై!

ముహూర్తానికి ముందే వధువును చంపిన వరుడు

.. వివరాలు 4లో



# రెండు రాష్ట్రాలు కలిసి నడవాలి



చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం
తెలంగాణ, ఏపీ అభివృద్ధికి సహకరిస్తా
రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీఆర్
రాష్ట్ర ప్రభుత్వ జీవోలు, ఇతర ఉత్తర్వులను ఇకపై తెలుగులోనే : సీఎం రేవంత్‌రెడ్డి
తెలుగు భాష సంరక్షణకు కృషి: చంద్రబాబు

**జనతా న్యూస్,హైదరాబాద్ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న చిన్న చిన్న సమస్యలను ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చునని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కలిసి అడుగులు వేస్తే రెండు రాష్ట్రాలూ అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. ఇరు రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఆదివారం రామోజీ ఫిలింసిటీలో

మిగతా 2 లో

# నేడు క్యాబినెట్ భేటీ.. స్థానిక ఎన్నికలపై చర్చ

మరోమారు కేంద్రంపై ఒత్తిడి తెద్దామా
కోర్టు సూచన మేరకు ఎన్నికలకు వెళదామా?
సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి బీసీలకు 42% కోసం పోరాడదామా?



**జనతా న్యూస్, హైదరాబాద్ :** పంచాయతీల పాలక మండళ్ల గడువు ముగిసి చాలా కాలమైనా.. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వంపై ఒత్తిడి నెలకొని ఉంది. మరోవైపు ఈ కారణంతో కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ.3 వేల కోట్ల నిధులు పెండింగ్‌లో ఉ ండిపోయాయని పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వానికి చెబుతూ వస్తోంది. అయితే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోంది. 42 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వం జారీ చేసిన

మిగతా 2 లో



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు.. నేడు సుప్రీంలో విచారణ

గత నెల 31తో ముగిసిన గడువు.. పొడిగించాలని కోర్టును కోరిన స్పీకర్
స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ కేటీఆర్ పిటిషన్
ఆ 10 మందిని అనర్హులుగా ప్రకటించాలని మరో పిటిషన్

.. వివరాలు 2లో



# 12ఏళ్లలో సీఎంలు బడులకు ఏమీ చేయలేదు..
## కేసీఆర్, రేవంత్‌లపై కవిత విమర్శ

బీఆర్ఎస్ వాళ్ల కామెంట్లకు జాగృతి కౌంటర్ ఉంటుందని హెచ్చరిక
'కర్మ హిట్స్ బ్యాక్' అని ఎవరిని ఉద్దేశించి అన్నారంటే.. 'జైతెలంగాణ' అంటూ సమాధానం

గత 12 ఏళ్లలో తెలంగాణ సీఎంలు ప్రభుత్వ బడుల కోసం ఏమీ చేయలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ సీఎంలుగా చేసిన ఇద్దరూ ప్రభు త్వ బడుల్లో చదువుకొని వచ్చామని మాత్రం చెబుతారని పేర్కొన్నారు. వారికి నిజమైన భావోద్వేగం ఉండుంటే రాష్ట్ర విద్యావ్యవస్థలోని సమస్యలు ఎప్పు డో పరిష్కారం అయ్యేవని చెప్పారు.

## కారణజన్ముడి కడుపున కవిత లాంటి రాక్షసి

వ్యాపారాల్ని కాపాడుకునేందుకే రేవంత్‌తో కుమ్మక్కు
హరీశ్‌రావుకు ఆమె క్షమాపణ చెప్పాలి
సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర వ్యాఖ్యలు
నిజామాబాద్‌లో చెల్లని రూపాయి.. ఇక్కడ చెల్లుతుందా
ఎమ్మెల్యే మాణిక్‌రావు ఎద్దేవా.. ఆమె కాంగ్రెస్ ట్రాప్‌లో పడ్డారు: పార్టీ విప్ వివేకానంద

.. వివరాలు 3లో



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
### ముగ్గురు మావోయిస్టులు మృతి

# ఐ బొమ్మ క్లోజ్

బప్పం టీవీ కూడా బంద్
తమను సవాలు చేసిన ఇమ్మడి రవితోనే ఆ వెబ్‌సైట్లు మూసివేయించిన పోలీసులు
రవి ఇంటి పేరే ఐ బొమ్మలో 'ఐ'.. రవిని కస్టడీకి కోరుతూ పోలీసుల పిటిషన్
రవి ఇలా ఎందుకు చేశాడో మాకు తెలీదు : రవి తండ్రి అప్పారావు

IBOMMA



.. వివరాలు 2లో

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
సోమవారం 17 నవంబర్ 2025




# రెండేళ్లలో అభివృద్ధి చేసి చూపించాం

## ' 2047 తెలంగాణ రైజింగ్ విన్ డాక్యుమెంట్ను ప్రపంచానికి చూపిస్తాం: భట్టి విక్రమార్క

**కందుకూరు :** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం' లోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిందని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యు మెంట్ను ప్రపంచానికి చూపించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో సీఎం రేవంత్రెడ్డి నేతృత్వంలో నిర్వ హిస్తున్న గ్లోబల్ సమ్మిట్కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొ న్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్పేటలో చేపడు తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్-2025 వేదికను ఆదివారం ఆయన సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. 2047 వరకు తెలంగా ణ ఏ రకంగా ఉండ బోతుంది.. ఎలా ఉండాలి? అనే విషయాలను ప్రజాప్రభుత్వం సమ్మిట్లో వివరిస్తుందని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో వేదిక ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని, అందులో ఫ్యూచర్ సిటీ, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, దుండిగల్ ప్రాంతాలు ఉన్నట్లు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్కు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని, హైదరాబాద్లో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన స్థలాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# ఛత్తీస్గఢ్లో ఎన్కౌంటర్

## ముగ్గురు మావోయిస్టులు మృతి

**చింతూరు, నవంబరు 16 :** ఛత్తీస్గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి, చింతగుప్ప పోలీసు స్టేషన్ల పరిధిలోని తుమ్మలపాడు అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎన్కౌంటర్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. తుమ్మలపాడు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందుకున్న డిస్ట్రిక్ట్ రిజర్వ్డ్ గ్రూప్స్ (డీఆర్జీ) బలగాలు అక్కడకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఇరుపక్షాల నడుమ ఎదురుకాల్పులు జరిగినట్టు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ పేర్కొన్నారు. కాల్పుల్లో కుంట ఏరియా కమిటీ జన్ మిలీషియా కమాండర్ మడవి దేవా, కిష్టారం ఏరియా కమిటీ ఏసీఎం సోడి గంగి, కుంట ఏరియా కమిటీ ఏసీఎం పొడియం గంగి మృతి చెందినట్టు పోలీసులు ధ్రువీకరిం చారు. వీరి తలలపై ఒక్కొక్కరికి రూ.5 లక్షల వంతున రివార్డు ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల కుంట ఏఎస్పీ ఆకాషరావ్ గిరిపుంజను హత్య చేసిన ఘటనలో ప్రధాన పాత్ర మడవి దేవాదేనని పోలీసుల కథనం. ఘటనా స్థలంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు.. నేడు సుప్రీంలో విచారణ

**గత నెల 31తో ముగిసిన గడువు.. పొడిగించాలని కోర్టును కోరిన స్పీకర్**

**స్పీకర్పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ కేటీఆర్ పిటిషన్**

**ఆ 10 మందిని అనర్హులుగా ప్రకటించాలని మరో పిటిషన్**



**న్యూఢిల్లీ, నవంబరు 16 :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ స్పీకర్కు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణకు సుప్రీంకోర్టు గతంలో విధించిన గడువు అక్టోబర్ 31వ తేదీతో ముగిసింది. దీంతో మరో 8 వారాలు గడువు పొడిగించాలని అదేరోజు స్పీకర్ కార్యాలయం కోర్టును కోరింది. రోజువారీ కార్యాక్రమాలు, స్పీకర్ల అంతర్జాతీయ సదస్సులు, విదేశీ పర్యటనలు తదితర కార్యక్రమాల్లో స్పీకర్ బిజీగా ఉ న్నందున గడువులోగా విచారణ సాధ్యంకాలేదని తెలిపింది. మరోవైపు స్పీకర్ ఉద్దేశపూర్వకంగానే విచారణ ఆలస్యం చేస్తున్నారని, అందువల్ల స్పీకర్పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, ఆ పదిమంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు అన్నింటినీ కలిపి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించనుంది. విచారణకు స్పీకర్కు మరికొంత సమయం ఇస్తారా? ఇస్తే ఎంత సమయం ఇస్తారు? అనేదానిపై సోమవారం స్పష్టత రానుంది. కాగా, ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరిలను ఇంతవరకూ స్పీకర్ విచారించలేదనే అంశంపైనే బీఆర్ఎస్ వాదనలు వినిపించే అవకాశం ఉంది. 24న సీజేఐ పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారా? మరో ధర్మాసనం వద్దకు పంపుతారా? అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# రెండు రాష్ట్రాలు కలిసి నడవాలి

మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ఉప రాష్ట్రపతి హాజరయ్యారు. దేశంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజ హితమే లక్ష్యంగా పనిచేస్తున్న వారికి ఈ అవార్డులను రాధాకృష్ణన్ చేతులమీదుగా అందజేశారు. అవార్డు గ్రహీతలకు మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు ఒక్కొక్కరికి రూ.10 లక్షల నగదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు భాషను కాపాడుకోవడానికి రామోజీరావు స్ఫూర్తితో పనిచేస్తామని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ జీవోలు, ఇతర ఉత్తర్వులను ఇకపై తెలుగులోనే ఇస్తామని ప్రకటించారు.

**విశేష కృషికి పురస్కారాలు..**

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతల్లో.. చెరువులు, చెక్డ్యామ్ల నిర్మాణం చేపట్టి జలసంరక్షణతో 18 లక్షల మంది గ్రామీణ ప్రజల జీవితాలను మార్చిన అమ్లా అశోక్ రుయాకు గ్రామీణాభివృద్ధి విభాగంలో అవార్డు దక్కింది. వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న శ్రీకాంత్ బొల్లాకు యూత్ ఐకాన్గా, ప్రపంచంలోనే ఎత్తైన కశ్మీర్లోని చినాబ్ వంతెనను డిజైన్ చేసిన బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ మాధవీలతకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పురస్కారాలు అందజేశారు. కాగా, మురికివాడల్లో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి.. వారి



జీవితాల్లో మార్పు తెచ్చిన ఆకాశ్ టాండన్కు మానవతా సేవల విభాగంలో, కళలు-సంస్కృతి విభాగంలో సత్తుపతి ప్రసన్నకు, జర్నలిజంలో కృషికిగాను జైదీప్ హర్దేకర్కు, మహిళా సాధికారత కోసం పాటుపడిన పల్లబీ ఘోష్కు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, రామ్మోహన్నాయుడు, బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు క్యాబినెట్ భేటీ.. స్థానిక ఎన్నికలపై చర్చ

మొదటి పేజీ తరువాయి

జీవో 9ను నిలిపివేస్తూ హైకోర్టు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న దానిపై సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకోనుంది. దీంతోపాటు వివిధ అంశాలు, కార్యక్రమాలకు సంబంధించి పాలన, విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. ప్రధానంగా స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణపైనే ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. కాగా, క్యాబినెట్ భేటీ కోసం స్థానిక ఎన్నికల పరిస్థితిపై పంచాయతీరాజ్ శాఖ సవివరమైన నోట్ను సిద్ధం చేసి ఉంచింది. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, కేంద్ర నిధులు పెండింగ్లో ఉండడం, డిసెంబరు 1 నుంచి పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం తుది ప్రయత్నాలు చేపట్టే అవకాశం వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం సమీక్షించనుంది.

**అఖిలపక్ష పార్టీలతో ఢిల్లీకి**

బీసీల రిజర్వేషన్ కోసం పార్లమెంటు సమావేశాల



సందర్భంగా అఖిలపక్ష పార్టీలు, సంఘాలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానిని కలవడం, పార్లమెంటు వేదికగా ఒత్తిడి తేవడం వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉ న్నాయి. దీంతోపాటు హైకోర్టు సూచన మేరకు పాత రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లి.. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చే అంశాన్నీ పరిశీలిస్తున్నారు. పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు పెండింగ్లో ఉన్న నేపథ్యంలో తొలుత గ్రామపంచాయతీల వరకు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదననూ పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నింటినీ సమీక్షించి.. స్థానిక ఎన్నికలపై క్యాబినెట్ ఓ నిర్ణయానికి రానుంది.

కాగా.. డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025, ప్రజా ప్రభుత్వ విజయోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపైనా సమీక్షించనున్నారు. వందేళ్ల ప్రగతికి రోడ్ మ్యాప్ కోసం రూపొందించనున్న తెలంగాణ రైజింగ్ - 2047 డాక్యుమెంట్ రూపకల్పనపైనా చర్చించనున్నారు.

# ఐ బొమ్మ క్లోజ్

**బప్పం టీవీ కూడా బంద్**

**తమను సవాలు చేసిన ఇమ్మడి రవితోనే ఆ వెబ్సైట్లు మూసివేయించిన పోలీసులు**

**రవి ఇంటి పేరే ఐ బొమ్మలో 'ఐ'.. రవిని కస్టడీకి కోరుతూ పోలీసుల పిటిషన్**

**రవి ఇలా ఎందుకు చేశాడో మాకు తెలీదు : రవి తండ్రి అప్పారావు**






**హైదరాబాద్ సిటీ, నవంబరు 16 :** ఐ బొమ్మ, బప్పంటీవీల్లో పైరసీ సినిమాల ఆట ముగిసింది. 'మా దగ్గర కోట్ల మంది డేటా ఉంది. మా మీద ఫోకస్ చెయ్యకండి, మమ్మల్ని ఆపలేరు.. వెతకలేరు' అంటూ గతంలో తమకు సవాలు విసిరిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవితోనే పోలీసులు ఆ వెబ్సైట్లను మూసి వేయించారు. ఇమ్మడి రవిని శనివారం అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు.. అతడి వద్ద నుంచి వెబ్ లాగిన్లు, సర్వర్ వివరాలు తీసుకొని అతనితోనే ఆయా సైట్లను మూసివేయించారు. పోలీసులు సాధించిన ఈ విజయంపై సినీ పరిశ్రమ నుంచిప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు ఇమ్మడి రవిని శనివారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు అతడికి రిమాండ్ విధించింది. అయితే, కేసు దర్యాప్తులో భాగంగా రవిని మరింత లోతుగా విచారించేందుకు ఏడు రోజుల కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. రవిని అదుపులోకి తీసుకొని లోతుగా విచారిస్తే..ఈ పైరసీ వ్యవహారం వెనక ఇంకెవరు ఉ న్నారో తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. కాగా, రవిపై నమోదైన తీవ్ర నేరం దృష్ట్యా అతనికి ఇప్పట్లో బెయిల్ వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.

**ఐ బొమ్మలో ఐ అంటే ఇమ్మడి**

ఏపీలోని విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి తన ఇంటి పేరులోని మొదటి అక్షరం ఐ ని తీసుకొని ఐ బొమ్మ పేరుతో వెబ్సైట్ ప్రారంభించాడు. ముంబైలో ఎంబీఏ పూర్తి చేసిన ఇమ్మడి రవి.. రెండు ఐటీ సంస్థలకు సీఈవోగా పని చేశాడు. కొన్నేళ్లకు ఆ ఉ ద్యోగం మానేసి నేరాల బాటపట్టాడు. హైదరాబాద్కు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లాడిన రవి.. ఐదేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లి ఐబొమ్మ కార్యకలాపాలు మొదలు పెట్టాడు. కొత్త సినిమాని విడుదలైన రోజే దొంగచాటుగా థియేటర్లలో వీడియో తీయించడం, వాటిని వెంటనే ఐబొమ్మ వెబ్సైట్లో అప్లోడ్ చేయడం చేస్తుండేవాడు. అలాగే ఓటీటీలో విడుదలైన సినిమాలను కూడా హెచ్డీ ప్రింట్తో ఐబొమ్మలో అప్లోడ్ చేసేవాడు. ఐబొమ్మ దెబ్బకు సినీ నిర్మాతలు, ఓటీటీ సంస్థలు తీవ్రంగా నష్టపోయేవి. ఈ క్రమంలో సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తుల మేరకు ఐబొమ్మపై తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. దీంతో మమ్మల్ని ఆపలేరు, వెతకలేరు అంటూ పోలీసులను సవాలు చేస్తూ ఐబొమ్మ వెబ్సైట్లో రెండేళ్ల క్రితం ఓ పోస్టు ప్రత్యక్షమైంది. ఈ పోస్టు సోషల్ మీడియాలో దుమారమే రేపగా.. కేసును పోలీసులు మరింత సవాలుగా తీసుకున్నారు. అయితే, పోలీసు నిఘా పెరగడంతో తెలివి ప్రదర్శించిన రవి బప్పం టీవీ పేరిట మరో ఖాతా ప్రారంభించి కొంతకాలంగా అందులో పైరసీ సినిమాలు అప్లోడ్ చేస్తున్నాడు. ఐబొమ్మ నిర్వాహకులను ఎలాగైనా పట్టుకుంటామని మూడు నెలల క్రితం అప్పటి హైదరాబాద్ సీపీ ఆనంద్ కూడా ప్రకటించారు. ఈ క్రమంలో నెదర్లాండ్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇమ్మడి రవిని.. కూకట్పల్లిలోని అతడి నివాసంలోనే అరెస్టు చేసిన పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. కాగా, కూకట్పల్లిలోని రెయిన్బో విస్టా ఫేజ్-2 అపార్ట్మెంట్లో రవికి ఓ ఫ్లాట్ ఉందని పోలీసులు గుర్తించారు. రవి అప్పుడప్పుడు అక్కడికి వచ్చి వెళు తుంటాడని, రవికి సంబంధించిన ఇతర వివరాలు తమకు తెలియని ఆ అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు తెలిపారు.

**ఎందుకు ఇలా చేశాడో తెలియదు**

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి తండ్రి ఇమ్మడి అప్పారావు విశాఖపట్నంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రవి ఎందుకు ఇలా చేశాడో తమకు తెలియదని చెప్పారు. రవి రాంగ్ రూట్లో వెళ్లాడని, ఆ సంగతిని ఇక పోలీసులే చూసుకుంటారని పేర్కొన్నారు. తాము చూసిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించిన రవి.. హైదరాబాద్కు చెందిన ఓ యువతి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని చెప్పారు. కొన్నాళ్లకు ఆమె నుంచి విడాకులు తీసుకున్నాడని తెలిపారు.

# 12ఏళ్లలో సీఎంలు బడులకు ఏమీ చేయలేదు..

**కేసీఆర్, రేవంత్‌లపై కవిత విమర్శ**
**బీఆర్ఎస్ వాళ్ల కామెంట్లకు జాగృతి కౌంటర్ ఉంటుందని హెచ్చరిక**
**'కర్మ హిట్స్ బ్యాక్' అని ఎవరిని ఉద్దేశించి అన్నారంటే..**
**'జైతెలంగాణ' అంటూ సమాధానం**



**హైదరాబాద్ :** గత 12 ఏళ్లలో తెలంగాణ సీఎంలు ప్రభుత్వ బడుల కోసం ఏమీ చేయలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ సీఎంలుగా చేసిన ఇద్దరూ ప్రభు త్వ బడుల్లో చదువుకొని వచ్చామని మాత్రం చెబుతారని పేర్కొన్నారు. వారికి నిజమైన భావోద్వేగం ఉండుంటే రాష్ట్ర విద్యావ్యవస్థలోని సమస్యలు ఎప్పు డో పరిష్కారం అయ్యేవని చెప్పారు. ఇక తాను చేసిన ఆరోపణలపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ రాష్ట్రం - విద్యావ్యవస్థ' అంశంపై తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో, తర్వాత మీడియా ప్రతినిధులతో కవిత మాట్లాడారు.

**హరీశ్‌రావు, గంగుల వివరణ ఇవ్వాలి..**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఓటమి అనంతరం 'కర్మ హిట్స్ బ్యాక్ (కర్మ మనకు తిరిగి తగులుతుంది)' అంటూ 'ఎక్స్' వేదికగా కవిత పెట్టిన పోస్టు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఎవరిని ఉద్దేశించి ఆ ట్వీట్ చేశారని మీడియా ఆమెను ప్రశ్నించగా.. 'జై తెలంగాణ' అని మాత్రమే కవిత సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ నేతలపై ఆమె తరచూ చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించగా.. "జాగృతి జనంబాట కార్యక్రమంలో ప్రజలు చెప్పిన అంశాల ఆధారంగానే నేను ఆరోపణలు చేశాను. నేనేమీ ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదు. నా ఆరోపణలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ వివరణ ఇచ్చినందుకు సంతోషం. అదే సమయంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ కూడా నా ఆరోపణలపై వివరణ ఇవ్వా లి. బాధ్యత కలిగినవారు వివరణ ఇచ్చుకోవాలే తప్ప ఎదురుదాడి చేయటం మంచిదికాదు" అని కవిత పేర్కొన్నారు. తనపై బీఆర్ఎస్ వాళ్లు చేసే కామెంట్లకు జాగృతి కార్యకర్తల నుంచి కౌంటర్ ఉంటుందని హెచ్చరించారు.

**విద్యాశాఖలో మార్పుల కోసం ఒత్తిడి చేస్తాం**

విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న సీఎం రేవంత్.. ప్రభుత్వ పాఠశాలల బాగు కోసం ఏం చేశారని కవిత ప్రశ్నించారు. విద్యా కమిషన్ ఏర్పాటు చేయ డం మంచి నిర్ణయమే అయినా.. ఆ కమిషన్ ప్రాధాన్యతలు, పనితీరుపై దృష్టిపెట్టాలని సూచించారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో మార్పులకోసం ప్రయత్నిస్తామని కవిత పేర్కొన్నారు.

**రైలు జనరల్ బోగీలో ప్రయాణం**

సోమ, మంగళవారాల్లో ఖమ్మం జిల్లా మధిర, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో నిర్వహించనున్న 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో పాల్గొనేందుకు కవిత ఆదివారం మధిర చేరుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్ డి6 కోచ్‌లో ఆమె ప్రయాణించారు. రైలులోనే పలువురు ప్రయాణికులతో మాట్లాడారు.

## కారణజన్ముడి కడుపున కవిత లాంటి రాక్షసి


**వ్యాపారాల్ని కాపాడుకునేందుకే రేవంత్‌తో కుమ్మక్కు**
**హరీశ్‌రావుకు ఆమె క్షమాపణ చెప్పాలి**
**సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర వ్యాఖ్యలు**
**నిజామాబాద్‌లో చెల్లని రూపాయి.. ఇక్కడ చెల్లుతుందా**
**ఎమ్మెల్యే మాణిక్‌రావు ఎద్దేవా.. ఆమె కాంగ్రెస్ ట్రాప్‌లో పడ్డారు: పార్టీ విప్ వివేకానంద**

**సంగారెడ్డి :** కారణజన్ముడి కడుపున కవిత లాంటి రాక్షసి పుట్టడం దురదృష్టకరమని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. తన వ్యాపారాలను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చేతులు కలిపి బీఆర్ఎస్ పైనా, తన తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్‌లపైనా కవిత విమర్శలు చేయడం తగదన్నారు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లినప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఆమెకు అండగా నిలిచారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి కోసం బీఆర్ఎస్‌ను నిందించడం మానుకుని ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నించాలని ఆయన హితవు పలికారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతిలతో కలిసి చింతా ప్రభాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనం బాట పేరుతో కవిత చేపట్టిన యాత్రలో ప్రజాసమస్యలపై మాట్లాడకుండా మాజీ మంత్రి హరీశ్‌రావుని, బీఆర్ఎసని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గత ఎన్నికల్లో హరీశ్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లాలో పది స్థానాలకు ఏడు సీట్లు గెలిపించారని గుర్తు చేశారు. హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలకు ఆమె బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా అని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ కుమార్తెగానే కవితకు గుర్తింపు వచ్చిందనే విషయాన్ని మరవొద్దని మాజీ ఎమ్మెల్యే క్రాంతి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రయోజనం కలిగించేలా.. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలున్నాయని, ఆమె కాంగ్రెస్ పార్టీ ట్రాప్‌లో పడ్డారని బీఆర్ఎస్ విప్ కె.పి.వివేకానంద ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు ఒకలా.. తర్వాత మరోలా ఆమె మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలపై కవిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ సర్కారులో పదేళ్లు ఎంపీ, ఎమ్మెల్సీ వంటి పదవుల్లో ఉన్నప్పుడు లేని సమస్యలు ఆమెకు ఇప్పుడెందుకు వస్తున్నాయని వివేకానంద నిలదీశారు.

## వణికిస్తున్న చలి

**రాష్ట్రంలో మరింత పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు**
**ఆదివారం అత్యల్పంగా సిర్పూర్‌లో 7.4 డిగ్రీలు**
**10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. ఇతర జిల్లాలకు యెల్లో అలర్ట్**
**శేరిలింగంపల్లిలో 10 డిగ్రీలకు పడి పోయిన ఉష్ణోగ్రతలు**
**రాబోయే రెండు మూడు రోజులు మరింత చలి**
**వాతావరణ కేంద్రం వెల్లడి**



**హైదరాబాద్ :** తెలంగాణలో చలి తీవ్రత పెరుగుతోంది. కొన్ని జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉ ష్ణోగ్రత నమోదైంది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు 6 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్ నగరంలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు 7 - 11 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. రాబోయే మూడు రోజులకుగాను 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్, నిర్మల్, భూపాలపల్లి, మంచిర్యాల, వరంగల్, ములుగు జిల్లాల్లో 6-10 డిగ్రీలలోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగిలిన అన్ని జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ నగరంలో ఆదివారం పలు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 10 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్ర నమోదైంది. శివారు ప్రాంతాలు, వృక్షాలు అధికంగా ఉన్న చోట ఉదయం పూట పొగమంచు దట్టంగా అలముకుంటోంది.



## 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీకి సర్వం సిద్ధం

**67లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండేసి చీరలు**
**ఇందిరాగాంధీ జయంతి రోజున ముహూర్తం**
**ఇప్పటికే జిల్లాల్లోని గోదాములకు సరఫరా**

**సిరిసిల్ల, నవంబరు 16 :** ఇందిరాగాంధీ మహిళా శక్తి పథకం కింద రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈనెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల(ఎసహెచ్‌జీ) మహిళకు రెండేసీ చీరలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అన్ని జిల్లాల గోదాములకు చీరలు చేరుకున్నాయి. ఇందుకు సంబంధించిన డిజైన్లను చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో టెస్కో రూపొందించింది. వాటి ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. నాణ్యమైన చీరలను అందించే దిశగా పలు చర్యలు తీసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి సిరిసిల్ల నేతన్నలకు ఉపాధినిచ్చాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చీరల్లో నాణ్యత లేదన్న కారణంతో వాటి పంపిణీ నిలిపివేసింది. దీంతో వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోయింది. నేతన్నల ఆత్మహత్యలు, ఆందోళనలు వంటి పాత పరిస్థితులు పునరావృతం అవుతాయన్న ఆందోళన నేపథ్యంలో.. బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**మరమగ్గాల కార్మికులకు చేతి నిండా పని...**

స్వశక్తి మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా, సిరిసిల్లలో మరమగ్గాలు ఎక్కువగా ఉండడంతో అక్కడి వస్త్ర పరిశ్రమకే ప్రభుత్వం ఎక్కువ ఆర్డర్లు ఇచ్చింది. దీంతో సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఉపాధి భరోసానిస్తున్నాయి. గతంలో జీవనోపాధి కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లిన అనేక మంది కార్మికులు ఇప్పుడు గ్రామాల్లోనే చేతి వృత్తిలో నిమగ్నమయ్యారు. దీంతో మరమగ్గాల చప్పుళ్లు మొదలయ్యి, నేతన్నలకు చేతినిండా పని దొరికింది. జిల్లాలో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(మ్యాక్స్)ల ద్వారా 9,600 మరమగ్గాలపైన 1.3 కోట్ల చీరల ఉత్పత్తి కొనసాగుతోంది. మొదట్లో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో చీరల ఉత్పత్తి వేగంగా జరగలేదు. క్రమంగా లక్ష్యం దిశగా.. వేగాన్ని పెంచడంతో చివరకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. మొత్తం 4.30కోట్ల మీటర్ల మేర వస్త్రం అవసరమవుతుందని అధికారులు అంచనా వేయగా, ఇప్పటికే 3.2 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తిని పూర్తిచేసి చివరి దశకు చేరుకున్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత.. హిందువుల్లో కసి పెరిగింది

**మనమంతా ఓటు బ్యాంకుగా మారాలి**
**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మతం మారిన వారు తిరిగి రావాలి**
**హిందూ ధర్మం కోసం పని చేయాలి : కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**



**హైదరాబాద్, నవంబరు 16 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం తర్వాత హిందువుల్లో కసి పెరిగిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ ఫలితం హిందువులకు గుణపాఠం అయిందని తెలిపారు. హిందువులంతా ఓటు బ్యాంకుగా మారాల్సిందేనని కోరారు. ఏపీ, తెలంగాణలో ఇతర మతాల్లో చేరిన హిందువులంతా ఘర్ వాపసీ రావాలని పిలుపునిచ్చారు. వారి కోసం హిందూ ధర్మ రక్షణ ద్వారాలు తెరిచే ఉన్నాయని స్పష్టం చేశారు. మతాలను మార్చుకుంటే దేవుళ్లను మోసం చేసినట్టేనని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడారు. అన్ని కులాలు తమ సామాజిక వర్గ సంక్షేమానికి పాటు పడుతూనే హిందూ ధర్మం కోసం పని చేయాలని సూచించారు. రాజకీయాలు, పదవులు, ప్రజల కోసం కుల సంఘాలు వేర్వేరుగా ఉన్నా.. దేశం కోసం, ధర్మం కోసం ఒక్కటి కావాలని కోరారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మ ప్రచారం వల్ల ఇతర మతాల్లో చేరిన హిందువుల్లో పునరాలోచన వస్తోందని సంజయ్ తెలిపారు.

## దళితుడు కాబట్టే సీజేఐ గవాయ్‌పై దాడి

**సంఘీభావ సభను అడ్డుకోవడం దారుణం: మందకృష్ణ**



**న్యూఢిల్లీ, నవంబరు 16 :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ గవాయ్ దళితుడు కాబట్టే ఆయనపై లాయర్ దాడి చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. ఈ వ్యవహారంలో పోలీసులు, మానవ హక్కుల కమిషన్ ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. స-ుమోటోగా కేసు నమోదు చేసే అధికారం ఉన్నప్పటికీ 50 రోజులైనా ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవట్లేదని ఆరోపించారు. కేంద్రం కూడా ఈ అంశంలో వివక్ష చూపుతోందన్నారు. గవాయ్‌కు సంఘీభావంగా జంతర్‌మంతర్ వద్ద నిర్వహించతలపెట్టిన సభను అడ్డుకోవడం దారుణమన్నారు. ఆదివారం ఢిల్లీలో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. సోమవారం సభ నిర్వహించాల్సి ఉండగా.. పోలీసులు అనూహ్యంగా అనుమతిని రద్దు చేసినట్లు చెప్పారు. సీజేఐపై దాడిని దళితుల ఆత్మగౌరవంపై దాడిగానే తాము భావిస్తున్నామన్నారు.

# బిహార్ సీఎంగా నితీశే!

## 19 లేదా 20న ప్రమాణ స్వీకారం

## మంత్రివర్గ ఫార్ములా కూడా ఖరారు!

## బీజేపీకి 15-16బీ జేడీయూకు 14 పదవులు



**న్యూఢిల్లీ :** బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమారే కొనసాగుతారా? మరోసారి ఆయనే సీఎంగా బాధ్యతలు చేపడతారా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. ఈ నెల 19 లేదా 20న బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుందని చెబుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో జరిగిన సమావేశంలో బిహార్ మంత్రివర్గ ఫార్ములాను ఖరారు చేసినట్లు సమాచారం. నితీశ్‌నే సీఎంగా కొనసాగించాలని ఆ భేటీలో నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గంలో సింహభాగం పదవులు బీజేపీకే దక్కనున్నట్లు తెలుస్తోంది. 15-16 పదవులు కాషాయ పార్టీకి, 14 పదవులు జేడీయూకు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ పార్టీ ఎల్జేపీకి మూడు, మరో కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝి పార్టీ హిందుస్థానీ అవామ్ మోర్చా(హెచ్ఏఎం)కు ఒకటి, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం)కు ఒకటి చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

**ఇదీ ప్రక్రియ..**

బిహార్‌లో 18వ అసెంబ్లీ ఏర్పాటుకు సంబంధించి ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాలను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు వివరిస్తారు. సోమవారం నితీశ్‌కుమార్ క్యాబినెట్ సమావేశం నిర్వహిస్తారు. 17వ శాసనసభను రద్దు చేస్తూ తీర్మానం ఆమోదిస్తారు. అనంతరం ఆయన తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. కూటమి నేతలు సమావేశమై ఎన్డీయే శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటారు. బుధ లేదా గురువారం సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని భావిస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ షెడ్యూల్‌ను బట్టి ప్రమాణ స్వీకార తేదీని ఖరారు చేయనున్నారు. నితీశ్ పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణం చేయనుండడం విశేషం. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరుకానున్నారు.

# పెళ్లి కోసం పసికందు బలి

## కాళ్లతో తొక్కి చంపిన నలుగురు యువతులు

## రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘటన



**జైపూర్ :** రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. కేవలం 16 రోజుల వయసున్న పసికందును నలుగురు యువతులు కాళ్లతో తొక్కి చంపారు. పెళ్లిళ్లు కావడం లేదనే నిరాశతో, కొడుకు వరుసయ్యే ఆ శిశువును బలిస్తే తమకు సంబంధాలు వస్తాయని నమ్మి వారు ఈ దారుణానికి పాల్పడినట్లు బాలుడి తండ్రి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వైరల్ అవుతున్న వీడియోలో, మహిళల్లో ఒకరు పసికందును ఒడిలో పెట్టుకుని మంత్రాలు జపిస్తోంది. ఆమె చుట్టూ కూర్చున్న మిగతా మహిళలు కూడా ఆ జపంలో పాలుపంచుకున్నారు. స్థానిక దేవత అయిన భైరును ప్రసన్నం చేసుకోవడం కోసం ఈ తంతు చేసినట్లు అధికారులు తెలిపారు. తన కొడుకును చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని బాలుడి తండ్రి డిమాండ్ చేశారు.


# ప్రేమ పాశమే.. యమపాశమై!

## ముహూర్తానికి ముందే వధువును చంపిన వరుడు

## చీర విషయమై గొడవ.. వరుడు రౌడీషీటర్

## గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఘటన





**భావ్‌నగర్ :** కొద్దిసేపట్లో వేద మంత్రాలు.. కుటుంబ పెద్దలు, బంధు మిత్రుల సాక్షిగా.. తాళి కట్టి.. ప్రేమించిన సహచరిని జీవిత భాగస్వామిగా చేపట్టాల్సిన వ్యక్తే కడతేర్చిన ఘటన గుజరాత్‌లోని జిల్లా కేంద్రమైన భావ్‌నగర్ నగరం టెక్రీచౌక్ ప్రాంతంలో శనివారం జరిగింది. సాజన్ బారయ్య (26) అనే యువకుడితో ప్రేమలో పడిన సోనీబెన్ రాథోడ్ (22).. అతడి కోసం కుటుంబాన్ని వదిలిపెట్టింది. ఇద్దరూ 8 నెలలు సహ జీవనం చేశారు. ఇరు కుటుంబాల అంగీకారంతో దాంపత్య జీవితంలో అడుగు పెట్టాలనుకున్నారు. ఈ నెల 15న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. అందమైన జీవితంపై కలలు కన్న సోనీబెన్ పెళ్లికి ముందు ఘనంగా జరిగిన మెహిందీ వేడుకలో ఒక చేతిపై 'సాజన్', మరో చేతిపై 'సదా సౌభాగ్యవతి భవ' అని రాసుకున్నారు. చివరకు ముహూర్తం వేళ సోనీబెన్ రాథోడ్ కట్టుకునే చీరతోపాటు డబ్బు విషయంలో వధూవరుల మధ్య మాటా మాటా పెరిగింది. ఆ కోపంలో వధువు సోనీ తలపై పైపుతో కొట్టిన సాజన్.. గోడకేసి కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందాక పరారయ్యాడు. సాజన్‌పై హత్యాయత్నం, దోపిడీ, భౌతిక దాడి తదితర కేసులతో రౌడ్ షీట్ కూడా ఉండటం గమనార్హం.

# ఢిల్లీ పేలుళ్ల కేసులో వైట్‌కాలర్ ఉగ్రవాదం

## ఆచూకీ లేకుండా పోయిన 15 మంది డాక్టర్లు

## మరో 200 మందిపైనా దర్యాప్తు సంస్థల నిఘా

## ప్రియాంక శర్మ అనే వైద్యురాలి అరెస్టు, విడుదల

## ఆమె సెల్‌ఫోను, ఓ సిమ్ కార్డు సీజ్

## ఉమర్ నబీ సహచరుడు రషీద్ అలీ అరెస్టు

## పేలిన ఐ20 కారు రిజిస్ట్రేషన్ రషీద్ పేరిటే



**శ్రీనగర్ :** ఢిల్లీ పేలుళ్ల కేసులో దర్యాప్తు సంస్థలు లోతుగా విచారణ చేస్తున్నాయి. ఇందులో భాగంగా వైట్ కాలర్ ఉగ్రవాదంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. అయితే, ఢిల్లీ పేలుడుతోపాటు వైట్‌కాలర్ ఉగ్రవాదంతో సంబంధం ఉన్న 15 మందికి పైగా డాక్టర్లు ప్రస్తుతం ఆచూకీ లేకుండా పో యారని పోలీసు వర్గాలు తెలిపాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా, కశ్మీరుల్లో ఉగ్రవాద కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న మరో 200 మంది వైద్యుల కదలికలపైనా నిఘా ఉంచినట్లు వెల్లడించాయి. మరోవైపు, ఉగ్రవాద చర్యలకు కేంద్ర బిందువుగా మారిన అల్‌ఫలా యూనివర్సి టీ ల్యాబ్‌లోనే అమ్మోనియం నైట్రేట్ పేలుడు పదార్థం తయారైందని, పాక్ ఉగ్రవాద నేత మసూద్ అజర్ సోదరి మార్గదర్శకత్వంలో లఖ్‌నవూ డాక్టర్ షాహిన్ సయీద్ ఈ కార్యక్రమాలకు సారథ్యం వహించిందని తెలుస్తోంది. కాగా, ఎర్రకోట వద్ద జరిగిన పేలుడుకి కారణమైన ఐ20 కారును నడిపిన వ్యక్తిని డాక్టర్ ఉమర్ నబీగా గుర్తించిన పోలీసులు అతడితో సంబంధము న్న ఐదుగురు వైద్యులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. ఈ వైద్యుల కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్టు తేలడంతో ఆయా వైద్యులతో కలిసి చదువుకున్న, పని చేసిన వైద్యులపైనా పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ప్రియాంక శర్మ అనే వైద్యురాలిని పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ పేలుడు కేసులో అరెస్టయిన డాక్టర్ అదీల్‌కు ప్రియాంక శర్మ తో పరిచయం ఉంది. అనంత్‌నాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల మాజీ ఉద్యోగైన అదీల్.. కాల్ డేటా ఆధారంగా పోలీసులు ప్రియాంక శర్మను గుర్తించారు. హరియాణాలోని రోహ్‌టక్‌కు చెందిన ప్రియాంక శర్మను అనంత్‌నాగ్‌లో ఆమె నివాసముంటున్న ఇంట్లోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ అనంతరం విడుదల చేశారు.

**నబీ సహచరుడి అరెస్టు**

ఎర్రకోట వద్ద పేలుడుకు గురైన ఐ20 కారును నడిపిన డాక్టర్ ఉమర్ నబీ సహచరుడు అమీర్ రషీద్ అలీ అనే వ్యక్తిని ఎన్ఐఏ ఆదివారం అరెస్టు చేసింది. పేలుడుకు గురైన ఐ20 కారు రషీద్ అలీ పేరు మీదే రిజిస్ట్రేషన్ జరిగిందని అధికారుల తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని పంపోరేకు చెందిన రషీద్... కారు కొనుగోలు విషయంలో నబీకి సహకరించేందుకు ఢిల్లీకి వచ్చాడని, ఎర్రకోట సమీపంలో అదే కారు పేలిందని అధికారులు పేర్కొన్నారు. ఇక, డాక్టర్ ఉమర్ నబీ అక్రమ మార్గాల ద్వారా రూ.20 లక్షల నగదు అందుకున్నట్టు పోలీసు దర్యాప్తులో తేలింది. ఇందుకు సంబంధించి పలువురు హవాలా డీలర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్టు తెలిసింది. నబీ నగదు రూపంలో చెల్లింపులు చేసి హరియాణాలోని నుహ్‌లో పెద్ద ఎత్తున ఎరువులు కొనుగోలు చేసినట్టు గుర్తించామని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

**కొడుకు, సోదరుడి అరెస్టులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం**

వైట్ కాలర్ ఉగ్రవాదం ఆరోపణలపై పోలీసులు తన కుమారుడు, సోదరుడిని అరెస్టు చేయడంతో మనస్తాపం చెంది జమ్మూకశ్మీర్‌కు చెందిన ఓ వ్యాపారి ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన బిలాల్ అహ్మద్ వానీ(50) అనే వ్యాపారి శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. తీవ్రమైన కాలిన గాయాలతో ఆస్పత్రిపాలైన బిలాల్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది.

## యూపీలో ఇద్దరు బ్రిటిష్ వైద్యుల అరెస్టు

**పత్రాలు లేకుండా అక్రమంగా నేపాల్ నుంచి ప్రవేశం**

**న్యూఢిల్లీ :** తగిన పత్రాలు లేకుండా దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన ఇద్దరు బ్రిటిష్ వైద్యులను ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు మహిళ కావడం గమనార్హం. నేపాల్ నుంచి అక్రమంగా వస్తుండగా బహరాయిచ్ జిల్లా రూపైదెహ్ సరిహద్దు వద్ద శనివారం సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ) పట్టుకొని పోలీసులకు అప్పగించింది. బ్రిటిష్ పాసుపోర్టులు ఉన్న వారిద్దరిని డాక్టర్ హస్సన్ అమ్మన్ సలీం (35), డాక్టర్ సుమిత్ర షకీల్ ఒలీవియా (61)గా గుర్తించారు. సలీం ప్రస్తుత చిరునామా మాంచెస్టర్ కాగా, తండ్రి మహమ్మద్ సలీం పాకిస్థాన్ మూలాలు ఉన్న వ్యక్తి. అమ్మన్ సలీం గతంలో మూడుసార్లు పాకిస్థాన్ వెళ్లినట్టు తెలిసింది. సుమిత్ర చిరునామా గ్లౌసెస్టర్ కాగా, స్వస్థలం కర్ణాటకలోని ఉడిపి. తండ్రి పేరు జాన్ ఫ్రెడరిక్. నేపాల్‌లోని నేపాల్‌గంజ్‌కు చెందిన స్థానిక ఆస్పత్రి ఆహ్వానం మేరకు అక్కడికి వచ్చినట్టు వారు చెప్పారని ఎస్ఎస్‌బీ 42వ బెటాలియన్ కమాండర్ గంగాసింగ్ ఉదావత్ తెలిపారు. వారి వద్ద భారత్ వీసా లేదని చెప్పారు. ఇటువైపు ఎందుకు వచ్చారో పత్రాలను తనిఖీ చేస్తున్న సమయంలో సంతృప్తికరమైన సమాధానం కూడా ఇవ్వలేదని చెప్పారు.

# ఢిల్లీలో కారు పేలుడుకు 'మదర్ ఆఫ్ సైతాన్'?

## అత్యంత అస్థిరమైన పేలుడు పదార్థం..

## వేడి, రాపిడి, తాకిడితో పేలే స్వభావం

## టీఏటీపీకి ఉన్న ఆ అస్థిరత్వం వల్లనే

## ఆకస్మికంగాపేలి ఉండొచ్చని అంచనా



**న్యూఢిల్లీ :** 'మదర్ ఆఫ్ సైతాన్'.. ఢిల్లీలో ఎర్రకోట వద్ద కారు పేలుడుకు ఉగ్రవాదులు ఉపయోగించిన పేలుడు పదార్థం ఇదేనా? ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారులు.. తొలుత ఈ పేలుడుకు ఉపయోగించిన 'ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) తయారీకి టెర్రరిస్టులు పెద్ద ఎత్తున అమ్మోనియం నేట్రేట్ వాడి ఉంటారని భావించారు. కానీ వారు.. 'మదర్ ఆఫ్ సైతాన్'గా పిలిచే అత్యంత అస్థిరమైన, ప్రమాదకరమైన రసాయనాల సమ్మేళనాన్ని అమ్మోనియం నైట్రేట్‌తో కలిపి వినియోగించినట్టు ఇప్పుడు భావిస్తున్నారు. దాని సాంకేతిక నామం.. ట్రైఎసిటోన్-ట్రైపెరాక్సైడ్ (టీఏటీపీ). 2-3 కిలోల అమ్మోనియం నైట్రేట్‌కు ఫ్యూయల్ ఆయిల్, ఈ టీఏటీపీని కలిపి ఈ పేలుడు పదార్థాన్ని తయారుచేశారని.. దాని బరువు 40-50 కిలోల దాకా ఉంటుందని అంచనా. పేలిపోయిన ఐ20 కారు వెనుక సీటులో ఒక పెద్ద సంచి ఉండడాన్ని దర్యాప్తు అధికారులు సీసీ టీవీ ఫుటేజీలో గుర్తించారు. అది సీటులో దాదాపు సగభాగం మేర ఆక్రమించి ఉందని.. ఉగ్రవాదులు తయారుచేసిన ఐఈడీ ఎంత పెద్దదో చెప్పడానికి అదే సంకేతమని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. కాగా.. ఆరోజు బాంబు పేలినప్పుడు దాని ప్రకంపనలు భూగర్భంలో 50 మీటర్ల వరకూ వ్యాపించాయని, కారులో ఉన్న ముగ్గురి ఉగ్రవాదుల శరీరభాగాలు సైతం 50 మీటర్ల విస్తీర్ణంలో చెల్లాచెదురుగా పడ్డాయని అధికారులు చెబుతున్నారు.

**తేలిగ్గా దొరికే రసాయనాలతోనే**

టీఏటీపీకి అత్యంత అస్థిరమైన పేలుడు పదార్థంగా పేరుంది! వేడి, రాపిడి, షాక్, స్థిరవిద్యుత్తు వంటివాటికి స్పందించే టీఏటీపీని తయారుచేయడం, తరలించడం, కలపడం.. చాలా ప్రమాదకరం. అందరికీ సులువుగా దొరికే హైడ్రోజన్ పెరాక్సైడ్, ఎసిటోన్ వంటి రసాయనాలతో అత్యంత సులభంగా తయారుచేయగలిగే 'మిలటరీ గ్రేడ్' పేలుడు పదార్థమిది. ఈ టీఏటీపీ ఆధారిత పేలుడుపదార్థాలు.. ఒక టీఎన్‌టీ శక్తిలో దాదాపు 80 శాతం మేర ప్రభావం చూపుతాయని సీనియర్ భద్రతాధికారి ఒకరు తెలిపారు. కాగా.. టీఏటీపీని పేల్చడానికి ఎలాంటి డిటొనేటరూ అక్కర్లేదు. కేవలం వేడి ఎక్కువగా ఉంటే చాలు పేలిపోతుంది. కిందటి శుక్రవారం (నవంబరు 14న) శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో పేలుడుకు కారణమిదే. ఎర్రకోట వద్ద కారు పేలుడుకు కూడా ఈ సున్నితత్వమే కారణమై ఉంటుందని.. అది ఆత్మాహుతి దాడి అయ్యుండకపోవచ్చని, పేలుడు పదార్థాన్ని తరలిస్తుండగా ఆకస్మికంగా పేలిపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి పేలుళ్లకు కుట్ర పన్నినప్పుడు ప్రాణనష్టం మరింత ఎక్కువగా ఉండడానికి పదునైన లోహపుముక్కలు, బాల్ బేరింగ్స్ వంటివాటిని వాడుతుంటారు. ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో అలాంటివేవీ లేకపోవడం.. అది ఆకస్మిక పేలుడు అయ్యుండొచ్చన్న వాదనకు మద్దతునిస్తోందని అధికారులు గుర్తుచేస్తున్నారు. వేడి, రాపిడి, తాకిడి వంటివాటివల్ల టీఏటీపీ ప్రాథమిక పేలుడు పదార్థంగా పనిచేసి ఉండొచ్చని.. ఆక్సిడైజర్‌గా పనిచేసే అమ్మోనియం నైట్రేట్, ఫ్యూయల్ ఆయిల్ కారణంగా పేలుడు తీవ్రత బాగా పెరిగిందని వారు విశ్లేషిస్తున్నారు.

**2015లో ఫ్రాన్స్‌లో 130 మంది మృతి**

మదర్ ఆఫ్ సైతాన్ బాంబు (టీఏటీపీ)ను.. విద్రోహులు గతంలో చాలా చోట్ల పేలుళ్లకు వినియోగించారు. ఉదాహరణకు.. 2005లో లండన్‌లోని ప్రజా రవాణా వ్యవస్థనే లక్ష్యంగా చేసుకుని జరిగిన నాలుగు ఆత్మాహుతి దాడులకు ప్రధానంగా ఉపయోగించింది టీఏటీపీనే. ఆ పేలుళ్లలో 52 మంది చనిపోయారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో 2015లో జరిగిన ఆత్మాహుతి దాడులకూ వాడింది టీఏటీపీనే. ఆ పేలుళ్లలో 130 మంది ప్రాణాలు కోల్పోయారు. 2016 మార్చి నెలలో బ్రసెల్స్‌లో జరిగిన ఆత్మాహుతి దాడుల్లో 32 మరణించారు. పేలుడు వాడింది.. టీఏటీపీ. 2017 మే నెలలో ప్రముఖ సింగర్ అరియానా గ్రాండే ఈవెంట్‌లో పేలుడుకు సూసైడ్ బాంబర్ వినియోగించింది టీఏటీపీ ఐఈడీ. ఆ పేలుడు కారణంగా 22 మంది చనిపోయారు.

## ఫ్లూ అంటే ఏమిటి..? దీని లక్షణాలు ఎలా ఉంటాయి..?

# ఏమేం చిట్కాలను పాటించాలి..?



సీజన్లు మారినప్పుడు లేదా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు, ఇన్‌ఫెక్షన్ ఒకరి నుంచి వ్యాప్తి చెందడం కారణంగా చాలా మందికి సహజంగానే దగ్గు, జలుబు వస్తుంటాయి. అలాగే వీటితోపాటు కొందరికి ఫ్లూ కూడా వస్తుంటుంది. దీన్నే ఇన్‌ఫ్లుయెంజా అని కూడా పిలుస్తారు. ఇది వైరస్‌ల వ్యాప్తి వల్ల సంభవించే ఒక వ్యాధి. ఎక్కువగా ముక్కు, గొంతు, ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. ఆయా భాగాలకు వ్యాప్తి చెందుతుంది. దగ్గు, జలుబు రోజుల తరబడి ఉండడం ఫ్లూ ముఖ్యమైన లక్షణాలు. ఫ్లూ అనేది అంటు వ్యాధి. ఒకరి నుంచి మరొకరికి చాలా సులభంగా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి పెద్దల కన్నా చిన్నారులకు ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కనుక తరచూ ఫ్లూ వస్తుంది. అలాగే పెద్దలకు కూడా అప్పుడప్పుడు ఫ్లూ వస్తుంటుంది. ఫ్లూ వస్తే కొందరికి దగ్గు, జలుబుతోపాటు పలు ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉంటాయి.

**ఫ్లూ లక్షణాలు..**

ఫ్లూ వచ్చిన వారిలో కొందరికి జ్వరం ఉంటుంది. కొందరికి జ్వరం తీవ్రత మరీ ఎక్కువగా ఉంటుంది. చలిగా ఉన్నట్లు వణుకుతారు. తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు కూడా ఉంటాయి. అలసట, నీరసం ఉంటాయి. గొంతులో మంట, దురద, నొప్పి, ముక్కు కారడం వంటి సమస్యలు కూడా వస్తాయి. తలనొప్పిగా ఉంటుంది. కొందరికి వికారంగా కూడా అనిపిస్తుంది. వాంతికి వచ్చినట్లు ఉంటుంది. ఇవన్నీ ఫ్లూ ఉందని తెలిపే లక్షణాలు. అయితే ఫ్లూ ఉన్నవారు వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. వారు సూచించిన విధంగా క్రమం తప్పకుండా మందులను వాడాలి. అలాగే పలు ఆహారాలను తీసుకుంటూ ఇంటి చిట్కాలను పాటిస్తుంటే ఫ్లూ నుంచి త్వరగా బయట పడవచ్చు. దీని నుంచి త్వరగా కోలుకుని మళ్లీ ఉత్సాహంగా మారుతారు.

**పాటించాల్సిన చిట్కాలు..**


ఫ్లూ ఉన్నవారికి ఉప్పు నీరు ఎంతో మేలు చేస్తుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలిపి ఆ నీటిని గొంతులో పోసుకుని పుక్కిలించాలి. రోజుకు ఇలా 3 సార్లు చేస్తుంటే ఉపశమనం లభిస్తుంది. ఫ్లూ సమస్యకు కారణం అయిన వైరస్ నశిస్తుంది. దీని వల్ల గొంతు సమస్యలు, ఛాతి పట్టేయడం తగ్గుతాయి. కఫం కరిగిపోతుంది. ఫ్లూ నుంచి ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్క, పుదీనా, నిమ్మ, యూకలిప్టస్ కు చెందిన ఎసెన్షియల్ ఆయిల్స్‌ను వాడుతున్నా ఉపశమనం లభిస్తుంది. ఈ ఆయిల్స్‌లో దేన్నయినా కాస్త తీసుకుని గొంతుపై మర్దనా చేయాలి. ఈ విధంగా చేస్తుంటే శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఫ్లూ తగ్గిపోతుంది. అలాగే జింక్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. చేపలు, మాంసం, పప్పు దినుసులు, బీన్స్, సీడ్స్, కోడిగుడ్లను అధికంగా తినాలి. వీటిల్లో ఉండే



జింక్ కారణంగా రోగ నిరోధక వ్యవస్థ శక్తివంతంగా మారుతుంది. తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల ఫ్లూ సమస్యకు కారణం అయ్యే వైరస్ నశిస్తుంది. దీంత ఫ్లూ నుంచి త్వరగా కోలుకుంటారు.

**తేనె..**

ఫ్లూ ఉన్నవారు రోజుకు 3 సార్లు తేనెను తీసుకుంటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. తేనెలో సహజసిద్ధమైన యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి బ్యాక్టీరియా, వైరస్‌లను నాశనం చేస్తాయి. కనుక ఫ్లూ ఉన్నవారికి తేనె బాగా పనిచేస్తుంది. ఇందుకు గాను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా తేనె కలిపి తీసుకోవాలి. ఇలా రోజుకు 3 సార్లు తీసుకుంటే ఉపయోగం ఉంటుంది. అలాగే ఫ్లూ సమస్యకు వెల్లుల్లి కూడా బాగానే పనిచేస్తుంది. పూటకు ఒక వెల్లుల్లి రెబ్బ చొప్పున తింటుంటే ఫలితం ఉంటుంది. వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. కనుక వెల్లుల్లిని తింటే బ్యాక్టీరియా, వైరస్‌లు నశిస్తాయి. దీంతో ఫ్లూ నుంచి బయట పడవచ్చు. ఇలా ఫ్లూ ఉన్నవారు పలు చిట్కాలను పాటిస్తూ ఆయా ఆహారాలను తీసుకుంటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దాని నుంచి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉంటారు.



## కంటి పరీక్షలతో గుండె ఆరోగ్యాన్ని పసిగట్టొచ్చు..!

సాధారణ కంటి పరీక్ష సైతం ఓ వ్యక్తి గుండె ఆరోగ్యంపై కీలక సంకేతాలను ఇస్తుందని తేలింది. కెనడాలో నిర్వహించిన పరిశోధనలో శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించారు. రెటీనాలోని చిన్న రక్తనాళాలను ప్రత్యేక స్కాన్‌లతో పరిశీలిస్తే, శరీర మొత్తం రక్తనాళ వ్యవస్థ పరిస్థితి, శరీరం ఎంత వేగంగా జీవ సంబంధమైన వృద్ధాప్యం స్థితిని అంచనా వేయవచ్చని తేల్చారు. ఈ పరిశోధన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' పత్రికలో వెల్లడయ్యాయి.

మెక్‌మాస్టర్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ మేరీ పిగెర్ వివరిస్తూ.. 'మన రక్తప్రసరణ వ్యవస్థను బయట నుంచి నేరుగా గమనించడానికి అవకాశం ఇచ్చే ఏకైక భాగం కంటి రెటీనా. అక్కడ కనిపించే నాళాల్లో మార్పులు, శరీరంలోని ఇతర సూక్ష్మ నాళాల పరిస్థితిని కూడా ప్రతిబింబిస్తాయి' అని తెలిపారు. అధ్యయనం కోసం 74,000 మందికి పైగా వ్యక్తుల రెటీనా చిత్రాలు, వారి జన్యు వివరాలు, రక్త నమూనాలు విశ్లేషించారు. రక్తనాళాల శాఖలు తక్కువగా, సూటిగా కనిపించే రెటీనా నిర్మాణం ఉన్నవారిలో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉండటమే కాకుండా, వృద్ధాప్య ఛాయలు కూడా వేగంగా కనిపించినట్లు గుర్తించారు. ప్రస్తుతం గుండె సమస్యలు, స్ట్రోక్, డిమెన్షియా వంటి వయస్సుతో పెరిగే వ్యాధులను గుర్తించడానికి పలు పరీక్షలు అవసరం అవుతాయి.

కానీ భవిష్యత్‌లో ఒక్క రెటీనా స్కాన్‌తోనే ఈ రిస్క్‌ను త్వరగా అంచనా వేసే అవకాశం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే దీన్ని వైద్యపరంగా పూర్తిగా ఉపయోగించే ముందు మరిన్ని పరిశోధనలు అవసరమని పరిశోధకులు చెబుతున్నారు. అలాగే, రక్తంలో ఉన్న బయోమార్కర్ల విశ్లేషణలో రెటీనా నాళాల్లో మార్పులకు కారణమవుతున్న రెండు ప్రధాన ప్రోటీన్లు కూడా గుర్తించారు. ఎంఎంపీ12 (MMP12), ఐజీజీ–ఎఫ్‌సీ రిసెప్టార్2బీ (IgG-Fc Receptor 2B) అనే ఈ ప్రోటీన్లు వాపు, రక్తనాళాల వృద్ధాప్యాన్ని పెంచుతాయని తేలింది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ మేరీ పిగెర్ మాట్లాడుతూ.. ఈ సమాచారంతో రక్తనాళాల వృద్ధాప్యాన్ని తగ్గించే కొత్త ఔషధాల అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని.. గుండె సంబంధిత వ్యాధుల భారాన్ని కూడా తగ్గించగలుగుతామన్నారు.

# చైనీస్ ఫాస్ట్ ఫుడ్‌ను ఎక్కువగా తింటున్నారా..?

## అయితే ఈ నిజం తెలిస్తే ఇకపై అలా చేయరు..!



ప్రస్తుతం నడుస్తున్నది అంతా ఫాస్ట్ యుగంగా మారింది. ప్రజలు అన్నింట్లోనూ వేగాన్ని కోరుకుంటున్నారు. తమ పనులు వేగంగా జరగాలని ఆశిస్తున్నారు. అందులో భాగంగానే ఆహారం విషయంలోనూ వారు ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్ ను తీసుకుంటున్నారు. సమయం ఉండడం లేదని లేదా వంట చేయలేదని చాలా మంది బయటకు వెళ్లి ఫాస్ట్ ఫుడ్స్‌ను లాగించేస్తున్నారు. ఫ్రైడ్ రైస్, మంచూరియా, నూడుల్స్ వంటి చైనీస్ ఫాస్ట్ ఫుడ్‌ను తినడం ఎక్కువైపోయింది. అయితే ఈ ఫుడ్స్‌ను ఎప్పుడో ఒకసారి తింటే ఫర్వాలేదు. శరీరానికి కలిగే హాని ఏమీ ఉండదు. కానీ చాలా మంది ఫాస్ట్ ఫుడ్స్‌ను తరచూ తింటున్నారు. ఇది ఆరోగ్యానికి చాలా హాని చేస్తుందని, అనేక వ్యాధులను, అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్‌ను తరచూ తినే వారు జాగ్రత్తగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

**తీవ్రంగా హాని చేసే అజినొమోటో..**


ప్రస్తుతం మనకు బయట ఎక్కడ చూసినా ఫాస్ట్ ఫుడ్ చాలా ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. రహదారుల పక్కన చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఎక్కువగా వెలుస్తున్నాయి. వాటిల్లో అనేక రకాల ఫాస్ట్ ఫుడ్స్ ను విక్రయిస్తున్నారు. ఆ ఫుడ్స్ అన్నీ ఎంతో రుచిగా ఉంటాయి. వాటిని వండేటప్పుడు వచ్చే వాసనకే చాలా మంది ఫిదా అవుతుంటారు. దీంతో వారు ఆ ఫుడ్స్‌ను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఫాస్ట్ ఫుడ్స్ వాసన చూస్తేనే కొందరికి నోట్లో నీళ్లూరతాయి. అయితే ఫాస్ట్ ఫుడ్స్ ను తరచూ తినడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. ఫాస్ట్ ఫుడ్ లో అజినొమోటో కలుపుతారు. అందువల్లే ఆ ఫుడ్స్‌కు అంతటి టేస్ట్ వస్తుంది. వాస్తవానికి దీన్ని ఆహారాల్లో వాడకూడదని ఎప్పుడో నిషేధం విధించారు. కానీ ఈ రూల్‌ను చాలా మంది పాటించడం లేదు. విచ్చల విడిగా అజినొమోటోను వాడుతున్నారు. ఇది మన ఆరోగ్యానికి తీవ్రంగా హాని చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**అధిక మొత్తంలో సోడియం..**

అజినొమోటోనే మోనో సోడియం గ్లూటమేట్ అని లేదా ఎంఎస్‌జీ లేదా టేస్టింగ్ సాల్ట్ అని రకరకాల పేర్లతో పిలుస్తారు. దీన్ని వేయడం వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే ఇది ప్రమాదకరమైన రసాయనం అని, దీన్ని తీసుకోవడం వల్ల అనేక వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అజినొమోటోలో 12.3 శాతం వరకు సోడియం ఉంటుంది. 21.1 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం, 0.4 మిల్లీగ్రాముల మేర ఐరన్ ఉంటాయి. అయితే సోడియం అధికంగా ఉంటుంది కనుక అజినొమోటో ఆరోగ్యకరమైనది కాదు. ఇది మన శరీరంలో చేరినప్పుడు అనారోగ్య సమస్యలను కలగజేస్తుంది. మనకు వ్యాధులు వచ్చేలా చేస్తుంది.

**అనేక అనారోగ్య సమస్యలు..**

అజినొమోటోను అధికంగా తీసుకుంటే శరీరంలో సోడియం ఎక్కువగా చేరుతుంది. ఇది కిడ్నీలపై భారం పెంచుతుంది. దీంతో కిడ్నీ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాగే సోడియం వల్ల రక్త నాళాలపై ఒత్తిడి పడుతుంది. దీంతో బీపీ పెరుగుతుంది. హైబీపీకి ఇది దారి తీస్తుంది. గుండె పనితీరు మందగిస్తుంది. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అజినొమోటో వల్ల శరీరంలో సోడియం అధికమై చెమట అధికంగా ఉత్పత్తి అవుతుంది. దీంతో చెమట పట్టినప్పుడు శరీరం దుర్వాసన వస్తుంది. అలాగే అలసట, డీహైడ్రేషన్, కీళ్లు, కండరాల నొప్పులు, జీర్ణాశయంలో మంట, గ్యాస్, అసిడిటీ, బీపీ, తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయి. ఇలా అజినొమోటో మనకు ఎంతో కీడు చేస్తుంది. కనుక అది ఉండే ఫాస్ట్ ఫుడ్స్‌ను అతిగా తినడం తగ్గించాలి. లేదంటే అనవసరంగా రోగాల బారిన పడాల్సి ఉంటుంది.



## శీతాకాలంలో గొంతు నొప్పి ఎందుకు వస్తుందో తెలుసా?

శీతాకాలంలో చాలా మంది జలుబు లేదా దగ్గు సమయంలో గొంతు నొప్పితో బాధపడతారు. ఎందుకంటే ఇది వైరల్ ఇన్ఫెక్షన్ల సాధారణ లక్షణం. వైరస్‌లు గొంతుకు ఇన్‌ఫెక్షన్ కలిగించడం వల్ల నొప్పి వస్తుంది. అలాగే.. దగ్గు, జలుబు వంటి ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ సమస్య అన్ని వయసుల వారిలో కనిపిస్తుంది. జలుబు, దగ్గు లేదా వైరల్ ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు వైరస్‌లు మొదట మన ముక్కు, గొంతు, శ్వాస మార్గంలోకి ప్రవేశిస్తాయి. మన శరీర రోగనిరోధక వ్యవస్థ ఈ వైరస్‌లకు ప్రతిస్పందిస్తుంది, మన గొంతు చుట్టూ ఉన్న పొరలలో మంటను కలిగిస్తుంది. ఈ వాపు వల్ల మన గొంతు వాపుగా అనిపిస్తుంది. ఈ వాపు వల్ల కొన్నిసార్లు మాట్లాడటం కూడా కష్టంగా మారుతుంది.

వాతావరణం మారి ఉష్ణోగ్రత తగ్గినప్పుడు గాలి పొడిగా మారుతుంది. మన గొంతులో తేమ తగ్గుతుంది. మనం చల్లని పానీయాలు, ఐస్ క్రీం తినేటప్పుడు లేదా చాలా చల్లని గాలిని పీల్చినప్పుడు, మన గొంతులోని పొరలు కుంచించుకుపోతాయి. రక్త ప్రసరణను తగ్గిస్తాయి. ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ సమయంలో వైరస్ సులభంగా దాడి చేస్తుంది. దీనివల్ల గొంతులో నొప్పి లేదా వాపు వస్తుంది.

**ఏం చేయాలి?**

వేడి నీరు, టీ, నిమ్మరసం వంటివి తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది.
గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసుకుని పుక్కిలించండి.
ఎక్కువగా ద్రవాలు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది.
లక్షణాలు తీవ్రంగా ఉంటే లేదా తగ్గకపోతే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# తొలి టెస్టులో భారత్‌కు అనూహ్య ఓటమి




## దక్షిణాఫ్రికా సంచలన విజయం
## సఫారీ స్పిన్ తంత్రంలో చిత్తయిన టీమ్ఇండియా
## సైమన్ ధాటికి విలవిల

టీమ్ఇండియా మారలేదు! సొంతగడ్డపై స్పిన్‌ను ఆడటంలో సుదీర్ఘ అనుభవమున్న భారత్.. మరోసారి స్పిన్ తంత్రంలోనే చిక్కుకుని అవమాన కరమైన ఓటమిని చవిచూసింది. సరిగ్గా ఏడాది క్రితం స్వదేశంలో న్యూజిలాండ్, భారత జట్టును స్పిన్ తంత్రంతోనే చుట్టేసి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఉదంతాన్ని గుర్తుకుతెస్తూ.. దక్షిణాఫ్రికా సైతం అదే మాయతో ఆతిథ్య జట్టుకు తొలి టెస్టులో అనూహ్య షాకిచ్చింది. సఫారీ స్పిన్నర్ల మాయకు 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక భారత బ్యాటింగ్ దళం నానా తంటాలు పడింది. తద్వారా రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1–0 ఆధిక్యంలో నిలిచింది. ఇరుజట్ల మధ్య రెండో టెస్టు ఈనెల 22 నుంచి గువహతి వేదికగా జరుగనుంది.

కోల్‌కతా: స్వదేశంలో బెబ్బులిలా గర్జించే భారత జట్టుకు కొట్టిన పిండి అయిన ఈడెన్ గార్డెన్స్‌లో ఊహించని షాక్ తగిలింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) డిఫెండింగ్ చాంపియన్ అయిన దక్షిణాఫ్రికాతో మూడు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో టీమ్ఇండియా 30 పరుగుల తేడాతో అవమానకర ఓటమిని మూటగట్టుకుంది. పర్యాటక జట్టు నిర్దేశించిన 124 పరుగుల స్వల్ప ఛేదనలో మెన్ ఇన్ బ్లూ.. 35 ఓవర్లలో 93 పరుగులకే చేతులెత్తేసి ఘోర పరాభవం వైపు నిలిచారు. సఫారీల తురుపుముక్క, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సైమన్ హర్మర్ (4/21) ఆఫ్ స్పిన్ మాయాజాలానికి తోడు కేశవ్ మహారాజ్ (2/37), పేసర్ మార్కో యాన్సెన్ (2/15) ధాటికి భారత బ్యాటర్లు క్రీజులో నిలిచేందుకు నానా తంటాలు పడ్డారు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా.. కెప్టెన్ టెంబా బవుమా (136 బంతుల్లో 55 నాటౌట్, 4 ఫోర్లు) అజేయ అర్ధ శతకంతో ఆ జట్టుకు పోరాడే స్కోరును అందించాడు.




**సమిష్టి వైఫల్యం**

లక్ష్యం పెద్దదేమీ కాకున్నా స్పిన్నర్లకు అనుకూలించిన పిచ్‌పై 124 రన్స్ ఛేదించడమూ టీమ్ఇండియాకు శక్తికి మించిన పనే అయింది. తొలి ఓవర్ నుంచే మొదలైన వికెట్ల పతనానికి ఎక్కడా అడ్డుకట్ట పడలేదు. మొదట్లో పేసర్ యాన్సెన్ పేస్ పదునుకు ఓపెనర్లిద్దరూ దారుణంగా విఫలమైతే హర్మర్ మిడిలార్డర్‌ను ఆటాడించాడు. వాషింగ్టన్ సుందర్ (92 బంతుల్లో 31, 2 ఫోర్లు) మినహా మిగిలినవారెవరూ నిలకడగా కనీసం 35 బంతులపాటు క్రీజులో నిలువలేకపోయారు. యాన్సెన్ వేసిన మొదటి ఓవర్లోనే జైస్వాల్.. కీపర్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. మూడో ఓవర్లో అతడు రాహుల్‌నూ అదే రీతిలో పెవిలియన్‌కు పంపడంతో భారత జట్టు 10/2తో భోజన విరామానికి వెళ్లింది.

లంచ్ తర్వాత జురెల్ (34 బంతుల్లో 13), వాషింగ్టన్ 12 ఓవర్ల పాటు క్రీజులో నిలబడ్డా స్కోరుబోర్డు మాత్రం నెమ్మదిగానే కదిలింది. లంచ్ అనంతరం తన ఐదో ఓవర్లో హర్మర్.. జురెల్‌ను ఔట్ చేసి 32 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. ఇక ఆ తర్వాత వచ్చినోళ్లు వచ్చినట్టు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గిల్ గైర్హాజరీలో స్టాండ్ ఇన్ కెప్టెన్ రిషభ్ పంత్ (2).. హర్మర్ బౌలింగ్‌లో అతడికే క్యాచ్ ఇచ్చాడు. ఆదుకుంటాడనుకున్న జడేజా (18) కూడా హర్మర్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. క్రీజులో ఒంటరిపోరాటం చేసిన వాషింగ్టన్‌ను పార్ట్ టైమ్ స్పిన్నర్ మార్క్మ్ బోల్తా కొట్టించడంతో భారత ఓటమి దాదాపుగా ఖరారైంది.

**ఖేల్ ఖతం**

భారత స్కోరు 77/7తో ఉన్న దశలో అక్షర్ పటేల్ (26) క్రీజులో ఉండటంతో భారత అభిమానులు ధీమాగానే ఉన్నారు. అందుకు తగ్గట్టుగానే అతడు.. మహారాజ్ వేసిన 35వ ఓవర్లో 4, 6, 6 బాదాడు. కానీ అదే ఓవర్లో ఐదో బంతికి బవుమాకు క్యాచ్ ఇవ్వడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. ఆరో బంతికి మహారాజ్.. సిరాజ్‌నూ ఔట్ చేసి 15 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికాకు భారత్‌లో తొలి టెస్టు విజయాన్ని ఖాయం చేశాడు.

**బవుమా పోరాటం**

ఓవర్ నైట్ స్కోరు 93/7తో మూడో రోజు క్రీజులోకి వచ్చిన సౌతాఫ్రికాను బవుమా ఆదుకున్నాడు. పట్టుదలగా బ్యాటింగ్ చేసిన అతడికి బాష్ (25) మంచి సహకారం అందించాడు. ఈ జోడీ 8వ వికెట్‌కు 44 రన్స్‌ను జోడించి ఆ జట్టు ఆధిక్యాన్ని వంద పరుగులు దాటించింది. ఈ భాగస్వామ్యమే భారత్‌ను దెబ్బతీసింది. బుమ్రా ఎట్టకేలకు బాష్‌ను బౌల్డ్ చేశాడు. అతడే వేసిన ఓవర్లో బౌండరీతో బవుమా హాఫ్ సెంచరీ పూర్తైంది. సిరాజ్ ఒకే ఓవర్లో హర్మర్ (18), మహారాజ్‌ను ఔట్ చేసి సఫారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. 1 భారత్‌లో భారత్‌ను ఓడించడం (టెస్టుల్లో) దక్షిణాఫ్రికాకు 2010 తర్వాత ఇదే ప్రథమం. 15 ఏండ్ల క్రితం ఆ జట్టు నాగ్‌పూర్ టెస్టులో ఆతిథ్య జట్టును ఓడించింది.

**సంక్షిప్త స్కోర్లు**

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159 ఆలౌట్‌బీ భారత్ తొలి ఇన్నింగ్స్: 189 ఆలౌట్‌బీ దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 153 ఆలౌట్ (బవుమా 55లి, బాష్ 25, జడేజా 4/50, సిరాజ్ 2/2)బీ భారత్ రెండో ఇన్నింగ్స్: 35 ఓవర్లలో 93 ఆలౌట్ (వాషింగ్టన్ 31, అక్షర్ 26, హర్మర్ 4/21, యాన్సెన్ 2/15)



## యువ భారత్ పరాభవం
### పాక్ చేతిలో ఓటమి

దోహా: ఆసియా రైజింగ్ స్టార్స్‌లో యువ భారత జట్టుకు చుక్కెదురైంది. లీగ్ దశలో భారత్.. పాకిస్థాన్ చేతిలో పరాభవం పాలై ఈ టోర్నీలో తొలి ఓటమిని ఎదుర్కొంది. మాజ్ సదాకత్ (79లి) బ్యాట్‌తో పాటు బంతి (2/12) రాణించడంతో మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం సాధించిన పాక్ ఏకపక్ష విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన యువ భారత్.. 19 ఓవర్లలో 136 రన్స్‌కే ఆలౌట్ అయింది. వైభవ్ సూర్యవంశీ (45), నమన్ ధీర్ (35) ధాటిగా ఆడినా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఛేదనను పాక్.. 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది.




## భారత్‌కు రెండో ఓటమి

బెంగళూరు: ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లేఆఫ్స్‌లో భారత్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా శనివారం స్లోవేనియా చేతిలో అపజయం పాలైన భారత్.. ఆదివారం తమ ఆఖరి మ్యాచ్‌లో 0–3తో నెదర్లాండ్స్ చేతిలోనూ ఓటమిపాలైంది. మహిళల సింగిల్స్ విభాగాల్లో శ్రీవల్లి, సహజతో పాటు డబుల్స్‌లో అంకిత, ప్రార్థన సైతం తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓడారు.

## ధనుష్‌కు స్వర్ణం..
### డెఫ్‌లింపిక్స్‌లో సత్తా చాటిన తెలంగాణ షూటర్




టోక్యో: ఇటీవల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్న తెలంగాణ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. టోక్యోలో జరుగుతున్న 25వ సమ్మర్ డెఫ్‌లింపిక్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం ఫైనల్‌లో 23 ఏండ్ల ధనుష్.. 252.2 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంతో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తాజా ప్రదర్శనతో గతంలో అతడే నెలకొల్పిన ప్రపంచ రికార్డు (251.7) కూడా కనుమరుగైంది. భారత్‌కే చెందిన మహ్మద్ వానియా (250.1) రజతం సాధించడంతో దేశానికి డబుల్ ఆనందం దక్కినట్టైంది. దక్షిణ కొరియాకు చెందిన బేక్ సెంఘుక్ (223.6) కాంస్యం సాధించాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో తెలంగాణ షూటర్.. 630.6 పాయింట్లు స్కోరు చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ధనుశ్, వానియతో పాటు మహిళా షూటర్లు రెండు పతకాలతో మెరిశారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్‌లో మహిత్ (250.5) రజతం గెలువగా ఇదే పోటీలో కోమల్ మిలింద్ (252.4) కాంస్యం నెగ్గింది.

**భారీ నజరానా ప్రకటించిన ప్రభుత్వం**

స్వర్ణంతో మెరిసిన ధనుష్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ. 1.20 కోట్ల నజరానా ప్రకటించింది. స్పోర్ట్స్ పాలసీ ప్రకారం ధనుష్‌కు ఈ నగదు బహుమానాన్ని అందజేయనున్నట్టు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

## హరికృష్ణ నిష్క్రమణ




పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. మెక్సికో ఆటగాడు జోస్ ఎడ్వర్డ్స్‌తో ముగిసిన ఐదో రౌండ్‌లో రెండు గేమ్‌లనూ డ్రా చేసుకున్న అతడు ఆదివారం జరిగిన టైబ్రేకర్‌లో ఓడిపోయాడు. కీలకపోరులో హరికృష్ణ.. 2.5–3.5తో ఎడ్వర్డ్స్ చేతిలో పరాభవం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఇక ఈ టోర్నీలో భారత ఆశలన్నీ అర్జున్ ఇరిగేసి మీదే ఉన్నాయి.

# జర్నలిస్టుల ఐక్యతే డబ్ల్యూజేఐ లక్ష్యం

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్




కరీంనగర్, జనత న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల ఐక్యతకు డబ్ల్యూజేఐ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కరీంనగర్ సప్తగిరి కాలనీలోని ఎస్ఆర్ఆర్ బ్యాంకెట్ హాల్లో డబ్ల్యూజేఐ జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే డబ్ల్యూజేఐ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న డబ్ల్యూజేఐ, తెలంగాణలో బలమైన శక్తిగా ఎదుగుతోందని అన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కొన్ని యాజమాన్యాలు జర్నలిస్టులకు వేతనాలు చెల్లించకపోవడంపై లేబర్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. యూనియన్ నిర్మాణంతో పాటు జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తున్న సంఘం కృషిని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, అనిల్ దేశాయ్, రాష్ట్ర కార్యదర్శి శివనాథుని ప్రమోద్ కుమార్, కార్యవర్గ సభ్యుడు టి. సత్యనారాయణ పాల్గొన్నారు.

**డబ్ల్యూజేఐ కరీంనగర్ జిల్లా కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక**

బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ కరీంనగర్ జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సప్తగిరి కాలనీ ఎస్ఆర్ఆర్ బ్యాంకెట్ హాల్లో జరిగిన సమావేశంలో క్రింది అధికారులు బాధ్యతలు స్వీకరించారు:

అధ్యక్షుడు:
దారం జగన్నాథరెడ్డి (భారత శక్తి)
ఉపాధ్యక్షులు:
మొగురం రమేష్ (తెలంగాణ తేజ ఎడిటర్)
నర్సరీ కేదారి (ప్రజాస్థానం దినపత్రిక)
ప్రధాన కార్యదర్శి:
గుడాల శ్రీనివాస్ (దిశ)
మహిళా కార్యదర్శులు:
వేముల సుమ (బతుకమ్మ టీవీ)
లావణ్య
ఆర్గనైజింగ్ కార్యదర్శులు:
రవీందర్ (ప్రజాసాక్షి)
జి. రమేష్ (బీఆర్‌కె న్యూస్)
సంయుక్త కార్యదర్శులు:
కీసర సదానంద్ (మన తెలంగాణ)
డి.ఎస్. ప్రసాద్ (తెలంగాణ న్యూస్ ఎడిటర్)
బూర్ల వెంకటేష్ (ప్రజాసాక్షి)
కోశాధికారి: చిటుమల్ల మహేందర్

కార్యవర్గ సభ్యులు: కృష్ణ హరి (తెలుగు ప్రభ), అనుగు శ్రీనివాసరెడ్డి, జి. రామకృష్ణ (విజయక్రాంతి), కంది శ్రీనివాసరెడ్డి (వార్త), పి. సంతోష్ గౌడ్ (ఆంధ్రప్రభ), జాలి నరేష్, కస్తూరి ప్రభాకర్ (డెస్క్), ఆకుల సంజీవరావు, గంగం రాజు (ఉదయం), కే. రవీంద్ర చారి (జనత), ఎమ్. రహీముద్దీన్ (స్కైలైన్), సిహెచ్. వెంకటేష్ (నవజ్యోతి), కే. కుమార్ (జనం న్యూస్), గుడికందుల దాసు (అక్షరం).

నూతన కార్యవర్గాన్ని పదవులపై ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# యాదగిరిలో కార్తీక పరవశం...!!

**ఆదివారం లక్షకు పైగా భక్తుల దర్శనం**
**రూ. 1, 04, 52, 688 ఆదాయం**
**ఏర్పాట్లలో అధికారుల సఫలం**



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో ఆదివారం యాదగిరి కొండ పులకించిపోయింది... ఆర్జిత పూజలతో ఆదివారము ఒక్కరోజే శ్రీవారి ఖజానాకు కోటి నాలుగు లక్షల 52వేల 688 రూపాయల ఆదాయం సమకూరింది. భక్త జనులతో యాదగిరికొండ పులకించిపోయింది. ఎటు చూసినా భక్తులే భక్తులు... శ్రీలక్ష్మీనరసింహున్ని దర్శించి తరించాలన్న తపన వారిలో కనిపించింది. కార్తీకమాసంలో హరిహరాదులను కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. యాదగిరి కొండపైన శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనంతో పాటు శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరున్నీ దర్శించుకుని మొక్కు పూజలు చెల్లించుకోవచ్చున్న తపన వారిలో కనిపించింది. గంటలపాటు బారులు తీరిన క్యూలైన్లలో వేచి ఉండి శ్రీ జై యాదగిరి వాసా జై...యాదగిరివాసా జై అంటూ స్తుతిస్తూ క్యూ లైన్లలో భక్తులు ముందుకు సాగిపోయారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్. వెంకట్రావు, ఆలయ ఏఈఓ గజవెల్లి రఘు, జూషెట్టి కృష్ణ తదితర ఆలయాధికారులు పర్యవేక్షణ చేస్తూ సమన్వయం చేశారు. ఆలయ ఎస్.పీ.ఎఫ్ ఇన్స్పెక్టర్ శేషగిరి రావు పోలీసు అధికారులతో కలిసి బందోబస్తు నిర్వహించారు. భక్తులకు వినోదం కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించారు.



# రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి పూజా కార్యక్రమం

**సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల విజయానికి ప్రత్యేక ప్రార్థనలు**
**హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతుల సత్యనారాయణ వ్రత పూజ**



హుస్నాబాద్, జనత న్యూస్:హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రత పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమానికి మహిళలు, పార్టీ కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలు భారీగా హాజరైనారు. రాష్ట్రంలోని ప్రజల సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు పడి..పాడి,పంటలు పుష్కలంగా పండాలని మంత్రి దంపతులు వేడుకున్నారు. అలాగే ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. సత్యనారాయణ వ్రతం సందర్భంగా హుస్నాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ వ్రతం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు ఆయురారోగ్యాలతో ఉండాలని,మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గం దినదిన అభివృద్ధి జరగాలని వారు ఆకాంక్షించారు.

# డబ్ల్యూజేఐ కరీంనగర్ జిల్లా ఎన్నికలలో రవీందర్, దాసు ఎన్నిక





చిగురుమామిడి, జనత న్యూస్: డబ్ల్యూజేఐ జర్నలిస్టు యూనియన్ కరీంనగర్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం కరీంనగర్‌లో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చిగురుమామిడి మండలం నుండి ఎనగందుల రవీందర్ డబ్ల్యూజేఐ జిల్లా జనరల్ సెక్రటరీగా, గుడికందుల దాసు ఈసి సభ్యునిగా ఎన్నికయ్యారు. సమావేశానికి హాజరైన సభ్యులు నూతనంగా ఎన్నికైన నాయకులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఎన్నికైన రవీందర్, దాసు తెలిపారు. ఎన్నికకు సహకరించిన రాష్ట్ర జిల్లా నాయకత్వానికి వారు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, అనిల్ దేశాయ్, కార్యదర్శి శివనాధుని ప్రమోద్ కుమార్, కార్యవర్గ సభ్యుడు టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలి

**షార్ట్ ఫిలిం ప్రారంభం**



తిమ్మాపూర్, జనతా న్యూస్ తల్లిదండ్రులను కన్నా కొడుకులు ప్రేమగా చూసుకోవాలని సందేశాన్ని అందించే షార్ట్ ఫిలిం షూటింగ్ తిమ్మాపూర్ లో ప్రారంభమైంది. తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం షార్ట్ ఫిలిం షూటింగ్ని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ ప్రారంభించారు. నా పెద్ద కొడుకు చాలా మంచోడు పేరుతో ప్రారంభమైన షార్ట్ ఫిలిం సందేశాత్మకమైనదని అజయ్ వర్మ తెలిపారు. చిన్న కొడుకు కోడలు ఇద్దరు తల్లిదండ్రులను నానా ఇబ్బందులు పెట్టే పాత్రలు సినిమాలో ఉన్నాయని, వీరు తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలనే సందేశతాత్మక సినిమాను దర్శకులు అక్కెన భాస్కర్ అందిస్తున్నారని తెలిపారు. సినిమాను అందరూ ఆదరించి తల్లిదండ్రులను గౌరవిస్తు, వృద్ధాప్యంలో ఒక చిన్న పాప లాగా చూసుకుని వారికి సమయానికి అన్నం పెట్టి మంచిగా చూసుకోవాల్సిన బాధ్యత కొడుకు కోడలు పైన ఉన్నదని తెలియజేశారు. ఈ సినిమాలో పెద్ద కోడలుగా ప్రియా, చిన్న కోడలు అలేఖ్య, చిన్నకొడుకు సాయి, తండ్రి పాత్రలో రాధా కిషన్, తల్లి పాత్రలో తెలంగాణ లక్ష్మి, పెద్ద మనుషుల పాత్రలో సర్వర్ బై తిరుపతి సమరసింహారెడ్డి తదితరులు సినిమాలో నటిస్తున్నారు.

# మళ్లీ మెగాస్టార్ కోల్ కత్తా బ్యాక్ డ్రాప్!



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా 158వ సినిమా బాబి దర్శకత్వంలో లాక్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. చిరంజీవి 157 నుంచి రిలీవ్ అవ్వగానే పట్టాలె క్కించాలని బాబి సర్వం సిద్ధం చేస్తున్నాడు. దాదాపు నటీనటుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. హీరోయిన్ విష యంలో డైలమా కొనసాగుతుంది. చిరంజీవి ఇమేజ్..వయసు దృష్టిలో పెట్టుకుని పర్ఫెక్ట్ నాయికగా కోసం సెర్చ్ చేస్తు న్నారు. మరికొన్ని రోజుల్లో హీరోయిన్ ఎవరు? అన్నది కూడా క్లారిటీ వచ్చేస్తుంది. ఈ నేపథ్యంలో బాబి ఎలాంటి బ్యాక్ డ్రాప్ తో కథ నడిపిస్తాడు? అన్న చర్చ మొదలైంది. దీంతో ఆ విషయం బయటకు వచ్చింది. బెంగాల్ బ్యాక్ డ్రాప్ లో సాగే యాక్షన్ థ్రిల్లర్ గా తెలిసింది. ఈ బ్యాక్ డ్రాప్ చిరు-బాబి ఇద్దరకు కలిసి వచ్చిందే. బాబి తొలి సినిమా 'పవర్' లో కొంత కథ బెంగాల్ నేపథ్యంలోనే సాగుతుంది. అక్కడ చిత్రీకరించిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయింది. అలాగే చిరంజీవి హీరోగా గుణశేఖర్ దర్శకత్వంలో 'చూడాలని ఉంది' కూడా పశ్చిమ బెంగాల్ బ్యాక్ డ్రాప్ లోనే సాగుతుంది. అందులో చిరంజీవి పాత్రను ఎంతో అందంగా చూపించారు. ఆసినిమా అప్పట్లో మంచి విజయం సాధించింది. ఇది వైజాగ్ బ్యాక్ డ్రాప్ లో సాగిన చిత్రం. కమర్శియల్ గా సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. ఆ నమ్మకంతోనే చిరంజీవి బాబి అప్రోచ్ అవ్వగానే మరో ఆలోచన లేకుండా 158 అతడితో లాక్ చేసారు. మరి ఈ బెంగాల్ బ్యాక్ డ్రాప్ ను బాబి ఏ కోణంలో చూపిస్తాడు? ఎంత కొత్తగా ఆవిష్కరిస్తాడు? అన్నది చూడాలి. చిరు ఇప్పటికే స్లిమ్ లోకి మారిపోయారు. ఆయన వయసు ఏకంగా 30 ఏళ్లు వెనక్కి వెళ్లినట్లు కనిపిస్తోంది. 157 తో పాటు 158 లో కూడా చిరు అదే లుక్ లో కనిపించనున్నారని తెలుస్తోంది.



# ట్రెడిషనల్ లుక్‌లో మెస్మరైజ్ చేసిన గ్లోబల్ స్టార్!

హాలీవుడ్ రేంజ్ కి ఎదిగిన ప్రియాంక చోప్రా ప్రస్తుతం పాన్ వరల్డ్ మూవీ వారణాసిలో హీరోయి-న్ రోల్ పోషించిన సంగతి మనకు తెలిసిందే. తాజాగా గ్లోబ్ ట్రోటర్ పేరుతో నిర్వహించిన ఈవెంట్లో దేవకన్య లాంటి గెటప్ లో దర్శనమిచ్చింది ఈ ముద్దుగుమ్మ.. ఈ ఈవెంట్ కి సాంప్రదాయమైన లుక్ లో ప్రియాంక చోప్రా ఎంట్రీ ఇవ్వడంతో చాలామంది ఆమె లుక్ కి ఫిదా అయ్యారు. అయితే ఈ లుక్ లో ఉన్న ఫోటోలను ప్రియాంక చోప్రా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో కూడా షేర్ చేసింది.. ఆ ఫోటోలను చూసిన చాలామంది అభిమానులు అద్భుతంగా ఉన్నారు అంటూ కామెంట్లు పెడుతున్నారు.. హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా జరిగిన గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్లో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, రాజమౌళి ఇలా ఎంతోమంది తారలు వచ్చి సందడి చేశారు. వీరందరిలో ప్రియాంక చోప్రా తన డ్రెస్సింగ్ స్టైల్ తో సెంటరాఫ్ అట్రాక్షన్ గా కనిపించింది. అనామిక ఖన్నా డిజైన్ చేసిన చీరలో ప్రియాంక చోప్రా సాంప్రదాయమైన లుక్ లో కనిపించింది. సాంప్రదాయమైన డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది.. రామోజీ ఫిలిం సిటీలో చుక్కలే దిగివచ్చినట్లుగా ప్రియాంక చోప్రా ఆ లైట్స్ కింద తన మిరుమిట్లు గొలిపే అందంతో కనిపించి అభిమానులను ఫిదా చేసింది. రీసెంట్ గానే ప్రియాంక చోప్రా కి సంబంధించిన మందాకిని ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రివీల్ చేశారు. ఇందులో శారీ కట్టుకొని గన్ చేతిలో పట్టుకొని యాక్షన్ మోడ్ లో ప్రియాంక చోప్రా కనిపించింది. అలా తాజాగా నిర్వహించిన గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్ లో దేశ విదేశాల నుండి ఎంతోమంది అభిమానులు వచ్చి ఈవెంట్ ని సక్సెస్ చేశారు.

# కెజిఎఫ్, సలార్‌ను మించేలా డ్రాగన్..



ఆర్ఆర్ఆర్ తర్వాత ఎన్టీఆర్ కు నేషనల్ వైడ్ గా బాగా గుర్తింపు దక్కింది. ఆ తర్వాత చేసిన దేవర, వార్2 సినిమాలు కూడా ఎన్టీఆర్ స్థాయిని మరింత పెంచి తన మార్కెట్ ను బాగా పెంచాయి. అయితే ప్రస్తుతం తారక్.. కెజిఎఫ్, సలార్ ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్‌నీల్ అనే వర్కింగ్ టైటిల్ తో ఈ మూవీ రూపొందుతుంది. సలార్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో పాటూ, ఇటు ఎన్టీఆర్, అటు నీల్.. ఇద్దరికీ మాస్ లో భారీ ఫాలోయింగ్ ఉండటంతో వీరిద్దరి కలయికలో మొదటిసారి తెరకెక్కుతున్న సినిమా కావడంతో డ్రాగన్ పై అందరికీ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పైగా ఈ సినిమా కోసం ఎన్టీఆర్ కెరీర్లో మునుపెన్నడూ లేనంత విధంగా స్లిమ్ గా మారారు. ఈ సినిమాలో తారక్ ను ప్రశాంత్ నీల్ నెవర్ బిఫోర్ లుక్ లో ప్రెజెంట్ చేస్తున్నారని, ఆల్రెడీ మూవీలో జూనియర్ ఎన్టీఆర్ కోసం ప్రశాంత్ నీల్ పలు ఎలివేషన్ సీన్స్ ను రూపొందించారని, సినిమాలోని ప్రతీ ఫ్రేమ్ లోనూ ఎన్టీఆర్ అంచనాలకు మించి కనిపించడంతో పాటూ తన స్క్రీన్ ప్రెజెన్స్ తో అందరిన ఆశ్చర్యపరుస్తారని చిత్ర యూనిట్ వర్గాలు చెప్తున్నాయి. ఆల్రెడీ సెట్స్ పైకి వెళ్లి షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో గతంలో వచ్చిన కెజిఎఫ్, కెజిఎఫ్2, సలార్ కంటే భారీగా ఉండబోతుందని, సినిమాకు సంబంధించిన నెక్స్ట్ షెడ్యూల్ త్వరలోనే మొదలవనుందని తెలుస్తోంది. రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేయనున్నారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ విషయంలో మేకర్స్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.



# ఆ బ్యూటీకి విజయ్ సేతుపతి స్ఫూర్తి!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి అనతి కాలంలోనే స్టార్ లీగ్ లో చేరాడంటే? అది ట్యాలెంట్ తో మాత్రమే సాధ్యమైంది. తన అసాధారణ నటనతోనే విమర్శకుల ప్రశంసలందుకున్నాడు. వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. తమిళ నటుడైనా? దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యాడంటే? కేవలం తన నటనతోనే సాధ్యమైంది. భవిష్యత్ లో కమల్ హాసన్ లా పరిశ్రమలో ఎదుగుతాడని అంచనాలు భారీగా ఉన్నాయి. ఎంతో మంది స్టార్ హీరోలున్నా? వాళ్లందరికంటే తాను ప్రత్యేకమనే విషయాన్ని తన పాత్రల ద్వారా చెప్పకనే చెబుతున్నాడు. అయితే విజయ్ సేతుపతిని %-%పొలిమేర%-% ఫేం కామాక్షి భాస్కర్ల స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తుందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తానే స్వయంగా రివీల్ చేసింది. విజయ్ సేతుపతితో పాటు మరో ఇద్దరు యంగ్ హీరోలు కూడా తనకు స్ఫూర్తిగా నిలిచారంది. విజయ్ సేతు పతిలాగే శ్రీవిష్ణు, సుహాస్ కూడా డిఫరెంట్ ప్రయత్నాలు చేస్తున్నారంది. హీరోయిన్లు కూడా అలా ఎందుకు చేయకూడదని తాను కూడా సవాల్ గా తీసుకు న్నట్లు తెలిపింది. విభిన్న రకాల పాత్రలు పోషించే ప్రయత్నం చేస్తున్నానంది. కెరీర్ ఆరంభం నుంచి తన ఆలోచనలు రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఉంటాయంది. ఈ బ్యూటీ కూడా డాక్టర్ కాబోయి యాక్టర్ అయింది. కానీ డాక్టర్ గా చదువు పూర్తి చేసింది. కొంత కాలం ఉద్యోగం కూడా చేసింది. ఆ తరువాతనే మోడలింగ్ పట్ల ఆసక్తి అటువైపు టర్న్ తీసుకుంది. అక్కడా గుర్తింపు రావడంతో సినిమాల్లోనూ ప్రయత్నాలు చేసి సక్సస్ అయింది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com